A-PDF Merger DEMO : Purchase from www.A-PDF.com to remove the watermark




# ప్రజా న్యూస్ నెట్ వర్క్
దినపత్రిక

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్,సంపుటి : 01,సంచిక : 128, చీఫ్ ఎడిటర్ : వి.శివకృష్ణ,తేదీ : 08-09-2026,పేజీలు :04, వెల: 03 రూ/-


## మోదీ సభ కోసం తొలిసారి
# 'బుక్ మైషో'లో రిజిస్ట్రేషన్
## వెయిటింగ్ లిస్ట్‌లో 42,000 మంది!

- మంగళవారం గుజరాత్‌లో పర్యటించనున్న నరేంద్ర మోదీ
- పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్న ప్రధాని
- ఈ కార్యక్రమం కోసం 'బుక్ మెషో'లో ఫ్రీగా రిజిస్ట్రేషన్



ఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 8న గుజరాత్‌లోని వడోదరలో పాల్గొననున్న కార్యక్రమానికి ప్రజల నుంచి ముందుగానే విశేష స్పందన వచ్చింది. తొలిసారిగా ప్రధాని కార్యక్రమానికి 'బుక్ మైషో' ద్వారా ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేపట్టారు. దీంతో రిజిస్ట్రేషన్ ప్రారంభమైన గంటలోపే అందుబాటులో ఉన్న సీట్లన్నీ బుక్ అయిపోయాయి. ఆ తర్వాత కూడా మిగతా..2లో

## రూ.1.10 లక్షల కోట్లతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లు
### కీలక ప్రతిపాదనలకు రక్షణ శాఖ పచ్చజెండా



- రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర
- ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లు

ఢిల్లీ : దేశ త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. మిగతా..2లో

## ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉంది
# ద్రవ్యోల్బణం పండుగల ఆనందాన్ని దెబ్బతీస్తోంది

- మోదీ ప్రభుత్వం ప్రతి వారం ద్రవ్యోల్బణంతో ప్రజల జేబులు కొడుతోందని జైరాం రమేశ్ ఫైర్
- "ద్రవ్యోల్బణం 'హై వోల్టేజ్ షాక్' ఇప్పుడు పండుగల ఆనందాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది.



ఢిల్లీ : నిత్యావసరాల ధరల పెరుగుదల వేళ కేంద్రంలోని మోదీ సర్కార్ పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ద్రవ్యోల్బణం 'హై-వోల్టేజ్ షాక్' ఇప్పుడు పండుగల ఆనందాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని విమర్శించింది. ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉందని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్ వ్యాఖ్యానించారు. పండుగ షాపింగ్ సీజన్ ప్రారంభం కాకముందే పెరుగుతున్న ధరలు గృహ బడ్జెట్లపై భారం మోపాయని పేర్కొన్న ఒక మీడియా నివేదిక స్క్రీన్‌షాట్‌ను ఆయన ఎక్స్ లో షేర్ చేశారు. "ద్రవ్యోల్బణం 'హై వోల్టేజ్ షాక్' ఇప్పుడు పండుగల ఆనందాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. మోదీ ప్రభుత్వం ప్రతి వారం ద్రవ్యోల్బణంతో ప్రజల జేబులు కొడుతోంది. కేవలం మూడు వారాల్లోనే ఉల్లిపాయల ధరలు రెట్టింపు అయ్యాయి. చక్కెర ధర 25 శాతం పెరిగింది. కందిపప్పు, మినుములు, ఆవాలు, రిఫైన్ డ్ ఆయిల్ ధరలు కూడా పెరిగాయి. దీపావళికి ముందే బాదం, జీడిపప్పు, మిగతా..2లో

## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు




- అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ
- సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని అంగీకరించిన ఎన్నికల సంఘం
- నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

హైదరాబాద్ : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది.

## కేసీఆర్ క్షమాపణ చెప్పాలని అసెంబ్లీలో
# సీఎం రేవంత్ డిమాండ్

- తాతా మధు వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం
- ఎమ్మెల్సీని డిస్మిస్ చేయాలని మండలి చైర్మన్ ను కోరిన వైనం
- స్పీకర్‌ను గౌరవించడం సభా సంప్రదాయమని వ్యాఖ్య
- బీఆర్ఎస్ నేతలపై సీఎం తీవ్ర ఆరోపణలు




హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తాతా మధును తక్షణమే చట్టసభ నుంచి డిస్మిస్ చేయాలని శాసనమండలి ఛైర్మన్‌ను కోరారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభలో సోమవారం మాట్లాడిన రేవంత్ రెడ్డి.. సభాపతి స్థానానికి ఎంతో గౌరవం ఉందన్నారు. స్పీకర్‌ను గౌరవించడం చట్టసభల కనీస సంప్రదాయమని చెప్పారు. మిగతా..2లో

## శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్



- తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడలేదని వెల్లడి
- ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపణ
- దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హైదరాబాద్: ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతి యుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో మిగతా..2లో

## ఏపీలో పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు

- ఈ నెలాఖరులోగా నియామకాలు పూర్తి చేయాలని ఆదేశం
- ఇప్పటికే 1,294 పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి వెల్లడి
- అర్హత: 10వ తరగతి, 25-45 ఏళ్ల వయసు, స్థానిక మహిళలు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 913 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేయనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఈ నియామక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. ఈ నియామకాలను జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఉండే జిల్లా ఆరోగ్య సొసైటీల ద్వారా చేపట్టనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. మిగతా..2లో

## చెన్నైలో మలేషియా విమానం అత్యవసర ల్యాడింగ్.. 186 మంది సురక్షితం..!




- దాంతో.. అందులో ప్రయాణిస్తున్న 186 మంది, చైన్నై విమానాశ్రయ సిబ్బంది హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు.
- రెండో ఇంజిన్‌లో సమస్య ఏర్పడడంతో పైలట్లు వెంటనే చెన్నై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను అప్రమత్తం చేశారు.

ఢిల్లి : మలేషియా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ఒకటి చెన్నై లో అత్యవసరంగా ల్యాండ్ అయింది. ఇంధనంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అప్రమత్తమైన పైలట్లు వెంటనే చెన్నై విమానాశ్రయాన్ని సంప్రదించి.. అనుమతి లభించగానే సురక్షింతంగా ల్యాండ్ చేశారు. అదృష్టవశాతూ విమానం ఎలాంటి ప్రమాదానికి గురవ్వలేదు. దాంతో.. అందులో ప్రయాణిస్తున్న 186 మంది, చైన్నై విమానాశ్రయ సిబ్బంది హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు. మలేషియా విమానయాన మిగతా..2లో

## అమరావతిపై నాకు అభ్యంతరం లేదు.. మా పార్టీ సీఎం అభ్యర్థి నేను కాదు





- ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాజధానిగా అంగీకరించాల్సిందేనన్న విజయసాయి
- రెడ్డి, కమ్మ సామాజికవర్గాల వారే సీఎంలుగా ఉండాలా అని ప్రశ్న
- తమ పార్టీలో 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తానని వెల్లడి

అమరావతి : "అమరావతిని రాజధానిగా ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మనకు ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించి తీరాల్సిందే" అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త రాజకీయ పార్టీ

## వైసీపీది ఉగ్రవాదుల తరహా రాజకీయం..
# ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి: సీఎం చంద్రబాబు

- రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి పడతామన్న సీఎం
- 'వాటర్ మ్యాన్'గా ఎకనామిక్ టైమ్స్ కథనంపై హర్షం
- సీఎంకు నేతల స్టాండింగ్ ఒవేషన్
- వైసీపీ ఫేక్ ప్రచారాన్ని ఫ్యాక్ట్‌తో తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకు సముచిత గౌరవమని హామీ
- టీడీపీ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్.. పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి : రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రతి ఎకరాకు నీరు అందించి తెలుగుతల్లికి జలహారతి పట్టడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సాగునీటి రంగంపై తాను చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రతిష్టాత్మక 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించడం సంతోషంగా ఉందని అన్నారు. అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల 'లీడర్‌షిప్ కాన్‌క్లేవ్'లో ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సాగునీటి రంగంపై చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందన తీర్మానం ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీతో యువతకు ఉపాధి కల్పించిన మిగతా..2లో

## ఢిల్లీలో మంత్రి నాదెండ్ల బిజీబిజీ..
# నిత్యావసర ధరలపై కీలక చర్చలు



- ఢిల్లీ పర్యటనలో ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ బిజీబిజీగా ఉన్నారు.
- ఇందులో భాగంగా నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్(వీణ)ని మంత్రి కలిశారు.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7: ఢిల్లీ పర్యటనలో ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్‌ని(వీణ) మంత్రి కలిశారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల సరఫరా తీరు, మిగతా..2లో

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

మంగళవారం 08-09-2026

మొదటి పేజి తరువాయి

## ఢిల్లీలో మంత్రి నాదెండ్ల బిజీబిజీ.. నిత్యావసర ధరలపై కీలక చర్చలు

ధరల నియంత్రణ, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా సరుకులు అందుబాటులో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజలందరికీ నాణ్యమైన నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. అనంతరం, కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరేని నాదెండ్ల మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆపై ఢిల్లీ ఏపీ భవన్‌లో సివిల్ సప్లై శాఖ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన రైస్ స్టోర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏబీఎన్‌తో నాదెండ్ల మాట్లాడుతూ.. ఢిల్లీలో తెలుగువారి కోసం నాణ్యమైన రైస్ అందించేందుకు స్టోర్‌ను ప్రారంభించామని తెలిపారు. రేపు కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి పామ్ ఆయిల్, ఉల్లిపాయలు, పప్పు ధరలపై చర్చిస్తామని చెప్పారు. సివిల్ సప్లై శాఖలో అవినీతి జరగకుండా చర్యలు చేపట్టామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## అమరావతిపై నాకు అభ్యంతరం లేదు.. మా పార్టీ సీఎం అభ్యర్థి నేను కాదు: విజయసాయిరెడ్డి

ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన ఆయన... భవిష్యత్ కార్యాచరణపై మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని.. ఏపీని రూ. 12 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకే తమ కొత్త పార్టీ ఉద్భవిస్తోందని స్పష్టం చేశారు. కేవలం రెడ్డి, కమ్మ సామాజిక వర్గాల వారే సీఎం స్థానంలో ఉండాలా? ఆయన ప్రశ్నించారు. బీసీలతో సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తామని... తమ పార్టీలో ఏకంగా 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ఆయన మరొక సంచలన ప్రకటన చేశారు. తన పార్టీకి తాను సీఎం అభ్యర్థిని కాదని స్పష్టం చేశారు. బాల్ థాకరే తరహాలో కేవలం 'మెంటర్' గా మాత్రమే దిశానిర్దేశం చేస్తానని తేల్చిచెప్పారు. తన కుటుంబ సభ్యులు ఎవరూ కూడా పదవుల్లో ఉండరని స్పష్టం చేశారు. రాష్ట్రం విడిపోయినప్పుడు రూ. 1.02 లక్షల కోట్లుగా ఉన్న అప్పులు, గత 12 ఏళ్ల పాలనలో రూ. 12 లక్షల కోట్లకు ఎలా చేరాయని... ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, ఇంటి అద్దెలను అదుపులోకి తీసుకురావడమే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని వెల్లడించారు.

## కేసీఆర్ క్షమాపణ చెప్పాలని అసెంబ్లీలో సీఎం రేవంత్ డిమాండ్

సభాపతిపై అభ్యంతరకరమైన భాషను ఉపయోగిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇది స్పీకర్‌కు జరిగిన అవమానం మాత్రమే కాదని, సభలోని ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవమానమని అన్నారు. బీఆర్ఎస్ సభ్యులను కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు పిలిపించి ఉసిగొల్పి పంపడం వల్లే ఆ పార్టీ నేతలు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. సభ్యుల హక్కులను కాపాడుతున్న స్పీకర్‌ను ఉద్దేశపూర్వకంగా అవమానించారని విమర్శించారు. ప్రభుత్వం కొన్ని సందర్భాల్లో సంయమనం పాటిస్తుందని, దాన్ని తమ చేతగానితనంగా భావించవద్దని హెచ్చరించారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో సభలను చూశానని, చట్టసభల్లో ఇంత అభ్యంతరకరమైన భాషను ఎప్పుడూ చూడలేదని రేవంత్ అన్నారు. ఇలాంటి వైఖరిని క్షమిస్తూ పోతే ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు ఉన్న గౌరవం దెబ్బతింటుందని హెచ్చరించారు. మరోవైపు బీజేపీపైనా సీఎం విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలను కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో నిర్ణయం తీసుకున్న తర్వాతే బీజేపీ లేవనెత్తిన అంశాలపై చర్చిస్తామని రేవంత్ స్పష్టం చేశారు.

## శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్

నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు. గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు. పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు

అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా రిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

## ఏపీలో పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు

అలాగే, దరఖాస్తుదారుల వయసు 25 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండటం తప్పనిసరి. సంబంధిత గ్రామాలు లేదా వార్డులకు చెందిన స్థానిక మహిళలకు ఈ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించనున్నారు. ఎంపికైన ఆశా కార్యకర్తలకు నెలకు రూ.10,000 చొప్పున గౌరవ వేతనం లభిస్తుంది. రాష్ట్రంలో ఇప్పటికే 1,294 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేశామని మంత్రి సత్యకుమార్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. తాజాగా మరో 913 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపామని, వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేసి క్షేత్రస్థాయిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తామని ఆయన వివరించారు. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సేవలు మరింత మెరుగుపడనున్నాయి.

## మోదీ సభ కోసం తొలిసారి 'బుక్ మైషో'లో రిజిస్ట్రేషన్- గంటలోనే సీట్లన్నీ ఫుల్

భారీ సంఖ్యలో ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం ప్రయత్నించడంతో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. ఈ సీట్ల బుకింగ్ తీరు మోదీ కార్యక్రమం పట్ల ప్రజలకు ఉన్న అపారమైన ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తోంది. నరేంద్ర మోదీ మంగళవారం వడోదరలో పర్యటించనున్నారు. నగరంలో రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇంకొన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మోదీ ప్రోగ్రామ్ సీట్ల రిజిస్ట్రేషన్ కోసం తొలిసారి వడోదర మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) బుక్ మైషోను ఉపయోగించింది. దీంతో ప్రధాని సభకు భారీగా స్పందన రావడం గమనార్హం.

## చెన్నైలో మలేషియా విమానం అత్యవసర ల్యాడింగ్.. 186 మంది సురక్షితం..!



సంస్థకు చెందిన విమానం సోమవారం అత్యవసరంగా చెన్నైలో ల్యాండ్ అయింది. 186 మంది ప్రయాణికులతో కౌలాలంపూర్ నుంచి చెన్నైకి బయల్దేరిన ఎంహెచ్156 గాల్లో ఉండగానే ఇంజిన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. రెండో ఇంజిన్‌లో సమస్య ఏర్పడడంతో పైలట్లు వెంటనే చెన్నై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను అప్రమత్తం చేశారు. సురక్షితంగా ల్యాండింగ్ చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దాంతో, చెన్నై విమానాశ్రయ అధికారులు హుటాహుటిన ఎమర్జెన్సీ సర్వీసులైన.. అంబులెన్స్, ఫైరింజన్లు, సీఐఎస్ఎఫ్ బృందాలను పిలిపించారు. అయితే.. పైలట్లు విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం 186 మంది ప్రయాణికులను, వారి లగేజీని దింపేశారు. ఇంధనంలో లోపం తలెత్తడానికి కారణాలను తెలుసుకునేందుకు ఢిల్లీ, చెన్నై విమానయాన అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ వారంలోనే ఇండిగో విమానాన్ని కూడా ఇలా అత్యవసర ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. సెప్టెంబర్ 1వ తేదీన గోవా నుంచి ఢిల్లీకి బయల్దేరిన 6ఈ 2102 విమానం గాల్లో ఉండగానే ఇంధనంలో సమస్య ఏర్పడింది. ఫ్లయిట్ గాల్లోకి ఎగిరిన పదిహేను నిమిషాల్లోనే ఈ సమస్య తలెత్తడంతో పైలట్లు.. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను సంప్రదించి సురక్షితంగా ల్యాండ్ చేశారు.

## వైసీపీది ఉగ్రవాదుల తరహా రాజకీయం.. ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి: సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి



చంద్రబాబు, ఇప్పుడు జల సంరక్షణతో 'వాటర్ మ్యాన్'గా మారారని కొనియాడారు. పట్టిసీమ, హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం వంటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సీఎం బాటలు వేస్తున్నారని ఎకనామిక్ టైమ్స్ కథనాన్ని ఆయన ఉటంకించారు. వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసే లక్ష్యాన్ని కూడా ఆ పత్రిక ప్రశంసించిందని తెలిపారు. ఈ ప్రశంసల నేపథ్యంలో పార్టీ నేతలంతా ఏకతాటిపై నిలబడి చంద్రబాబుకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చి అభినందనలు తెలిపారు.

### కార్యకర్తలే పార్టీకి బలం.. కూటమి ఐక్యత ముఖ్యం

పొలిటికల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు సాగుతున్నామని చంద్రబాబు తెలిపారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు పూర్తి గౌరవం ఇస్తామని, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవికి పదవి ఇవ్వడమే దీనికి నిదర్శనమని అన్నారు. క్షేత్రస్థాయిలో సమర్థంగా పనిచేసే వారికే పార్టీలో, చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. "పార్టీ బలోపేతం ఎంత ముఖ్యమో, కూటమి ఐక్యత కూడా అంతే ముఖ్యం. ఫ్లెక్సీలు, ఫోటోల కోసం వివాదాలకు తావివ్వకుండా కలిసికట్టుగా పనిచేయాలి. 2024 కంటే 2029లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలి," అని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

### గత పాలనపై విమర్శలు.. ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై పెట్టి, వ్యవస్థలను విధ్వంసం చేసిందని చంద్రబాబు విమర్శించారు. పాలకుడు ఎలా ఉండకూడదో చెప్పడానికి గత పాలనే ఒక కేస్ స్టడీ అని వ్యాఖ్యానించారు. "వైసీపీ ఒక గొడ్డలి పార్టీ. ఉగ్రవాదుల తరహాలో హిట్-రన్-హైడ్ అనే విధానంతో రాజకీయాలు చేస్తోంది. వారి ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దు. ప్రతి ఆరోపణను వాస్తవాలతో (ఫ్యాక్ట్) గట్టిగా తిప్పికొట్టాలి. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి," అని నేతలకు దిశానిర్దేశం చేశారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ విషయంలో వైసీపీ వక్రీకరణలకు పాల్పడుతోందని, వాటిని ఎండగట్టాలని సూచించారు.

### అభివృద్ధి, సంక్షేమంలో దూకుడు

కేంద్ర సహకారంతో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని చంద్రబాబు వివరించారు. నెలకు రూ.73 వేల కోట్లతో 63 లక్షల మందికి పైగా పెన్షన్లు అందిస్తున్నామని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్లు వంటి పథకాలను పునరుద్ధరించామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టామని, మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, రాయలసీమలో పరిశ్రమలు, అమరావతిలో క్వాంటం టెక్నాలజీ హబ్ ఏర్పాటుతో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని వివరించారు. రాజముద్ర, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భూములకు భద్రత కల్పిస్తూ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

## ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉంది- ద్రవ్యోల్బణం పండుగల ఆనందాన్ని దెబ్బతీస్తోంది

మొదటి పేజి తరువాయి

పిస్తా, ఎండుద్రాక్ష, వాల్‌నట్‌లు కూడా ఖరీదయ్యాయి. పాలు, చక్కెర ధరలు పెరగడంతో స్వీట్ల ధరలు కూడా నిరంతరం పెరుగుతున్నాయి. నెయ్యి, మసాలాల ధరలు కూడా పెరుగుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే వంటగది, పండుగలు ఖరీదైనవిగా మారాయి. గృహ బడ్జెట్ ఇబ్బందుల్లో పడింది. ప్రజల జేబులపై పడుతున్న ఈ భారం మోదీ ప్రభుత్వానికి కనిపించడం లేదు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయకుండా, ప్రభుత్వం గణాంకాల గారడీతో దాని ప్రభావాన్ని దాచడంలో నిమగ్నమైంది. మోదీ గణాంకాల గారడీ ద్రవ్యోల్బణం ప్రభావాన్ని దాచలేరు. ప్రజలు ప్రతీదీ గమనిస్తున్నారు."

### జైరాం రమేశ్, కాంగ్రెస్ ఎంపీ

పెరుగుతున్న ధరల రూపంలో దేశానికి "హై వోల్టేజ్ షాక్" ఇస్తోందని కేంద్రంపై కాంగ్రెస్ ఇప్పటికే తీవ్ర విమర్శలు గుప్పించింది. అలాగే "అహంకారపూరిత" మోదీ ప్రభుత్వం "గణాంకాల గారడీ"తో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తోందని పేర్కొంది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో నమోదైన 7.8 శాతం జీడీపీ వృద్ధి రేటు "ఆర్థిక పునరుజ్జీవనానికి సంకేతం" కాదని ఆ పార్టీ తెలిపింది.

### పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను వాయిదా జాప్యంపై కాంగ్రెస్ ఫైర్

మరోవైపు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను వాయిదా వేయడంలో జాప్యంపై కాంగ్రెస్ సోమవారం ప్రశ్నించింది. డీలిమిటేషన్ బిల్లులను ఆమోదించడానికే హోం మంత్రి అమిత్ షా సభలను వాయిదా వేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించింది. కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్ ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. "పార్లమెంటును నిరవధికంగా వాయిదా వేసి నేటికి సరిగ్గా 25 రోజులు అయ్యింది. కానీ దానిని ఇంకా ప్రొరోగ్ చేయలేదు. సాధారణంగా నిరవధిక వాయిదా వేసిన 3-4 రోజుల తర్వాత ప్రొరోగేషన్ జరుగుతుంది. కానీ 2015 వర్షాకాల సమావేశాల్లో ఇది 28 రోజుల వ్యవధి ఉంది. లలిత్ మోదీ అంశంపై ఆందోళనలతో ఆ సమావేశాలు దాదాపు పూర్తిగా రద్దయ్యాయి. కానీ మోదీ ప్రభుత్వం జీఎస్టీ బిల్లులను బలవంతంగా ఆమోదింపజేయాలనే ఆశతో సమావేశాలను కొనసాగించింది. దానికి రాజ్యసభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం, కానీ అది



వారికి లేదు. చివరికి, మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలతో మరింత అర్థవంతంగా సంప్రదించి చాలా ఆలస్యంగా బిల్లులను ఆమోదించాల్సి వచ్చింది. డీలిమిటేషన్ బిల్లులను ఆమోదం కోసం హోం మంత్రి ఇప్పటికీ లోక్‌సభలో తనకు ఇష్టమైన మూడింట రెండు వంతుల మెజారిటీ కోసం నానా తంటాలు పడుతుండటంతో 2026 వర్షాకాల సమావేశాలు వెంటిలేటర్‌పై ఉన్నాయి. ఆయన బెదిరింపులు, భయపెట్టే రాజకీయాలు హద్దులు దాటాయన్న వాస్తవాన్ని అంగీకరించడానికి ఇంకెంత కాలం పడుతుంది?" అని జైరాం రమేశ్ అన్నారు.

## రూ.1.10 లక్షల కోట్లతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లు- కీలక ప్రతిపాదనలకు రక్షణ శాఖ పచ్చజెండా

మొదటి పేజి తరువాయి

ఏకంగా 1.10 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ పలు కీలక ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఆమోదం పొందిన ప్రతిపాదనల్లో 98 శాతం దేశీయ రక్షణ రంగ సంస్థల నుంచే కొనుగోళ్లు చేయనున్నట్లు స్పష్టం చేసింది.

### రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర

సాయుధ దళాల ఆధునీకరణే లక్ష్యంగా ఈ ఏడాదిని 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించిన రక్షణశాఖ త్రివిధ దళాల బలోపేతానికి



కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యానికి అవసరమైన ఆయుధ పరికరాల సేకరణకు పచ్చజెండా ఊపింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఏకంగా రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదముద్ర వేసింది.

### అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం

డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో భారత సైన్యానికి అవసరమైన కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ రెక్కీ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలు కలుషితమైన ప్రాంతాలను గుర్తించి, పర్యవేక్షించడంతో పాటు మార్కింగ్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అత్యంత క్లిష్టమైన సరిహద్దు భూభాగాల్లో దళాల వేగవంతమైన కదలికలు, లాజిస్టిక్స్, ఆపరేషనల్ సపోర్ట్ కోసం హై మొబిలిటీ వెహికల్స్ కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రువులకు ముకుతాడు వేసేలా సవాలుతో కూడిన ప్రాంతాల్లో అత్యంత వేగంగా, సమర్థవంతంగా మందుపాతరలను అమర్చేందుకు సెల్ఫ్-ప్రొపెల్డ్ మెకానికల్ మైన్ లేయర్స్ కొనుగోలుకు సైతం ఆమోదముద్ర వేసింది. యుద్ధ సమయాల్లో క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాల్లో అత్యంత సంక్లిష్టమైన మిషన్లలో కీలకంగా వ్యవహరించే అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, సర్వత్ర బ్రిడ్జ్ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది.

## ఈనెల 12 వరకు అసెంబ్లీ సమావేశాలు - బీఏసీ భేటీలో నిర్ణయం


శాసనసభ, మండలి నిర్వహణపై ముగిసిన బీఏసీ సమావేశాలు

ఈనెల 12 దాకా శాసనసభ, వారం దాకా మండలి సమావేశాల నిర్వహణకు ఆమోదం

22ఏ, ఫీజు రియంబర్స్ మెంట్ పై చర్చలు జరపాలని విపక్షాల డిమాండ్

ఈనెల 12 దాకా శాసనసభ నిర్వహించాలని బీఏసీ సమావేశంలో నిర్ణయం

ఢిల్లి : శాసనసభ, మండలి సమావేశాల నిర్వహణపై జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు ఉభయ సభలను ఈనెల 12 వరకు నిర్వహించాలని బీఏసీలో ప్రాథమికంగా నిర్ణయించారు. సమావేశాల పొడిగింపుపై అవసరమైతే మరోసారి సమీక్ష జరపాలని నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన ఇవాళ జరిగిన శాసనసభ బీఏసీ సమావేశంలో ప్రధానంగా ప్రజా సమస్యలపై చర్చించేందుకు అజెండా రూపొందించారు. ఈ భేటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే బలాల హాజరయ్యారు. ఉదయం శాసనసభకు వెళ్తున్న తమపై పోలీసులు దౌర్జన్యం చేశారని నిరసిస్తూ బీఆర్ఎస్ ఈ సమావేశాన్ని బహిష్కరించింది. అసెంబ్లీ బీఏసీ సమావేశంలో 22ఏ, ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై స్వల్పకాలిక చర్చలు జరిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇవాళ ఉదయం 22ఏ నిషేధిత భూముల జాబితాపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. దీంతో పాటు మరో 22 కీలకమైన అంశాలపై చర్చ జరిపేందుకు కనీసం 15 రోజుల పాటు అసెంబ్లీలో సమావేశాలు నిర్వహించాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నిరోజులు సభ నిర్వహించినా సిద్ధమే : ఫీజు రీఎంబర్స్‌మెంట్‌తో పాటు మైనారిటీ అంశాలపైనా అసెంబ్లీలో చర్చలు జరపాలని ఎంఐఎం నేత బలాలా సైతం కోరారు. ఈ నేపథ్యంలో సభలో ఎన్నిరోజులైనా సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కాగా బీఏసీ సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్.. రాష్ట్రంలో ప్రజా సమస్యలు చాలా ఉన్నాయని, అసెంబ్లీని కనీసం 20



నుంచి 30 రోజుల పాటు నడపాలని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. వారంపాటు మండలి సమావేశాలు : మరోవైపు శాసనమండలి సమావేశాలను వారం రోజులపాటు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించినట్లు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. సభ్యుల కోరిక మేరకు అవసరమైతే మరిన్ని రోజులు పొడగిస్తామని ఆయన పేర్కొన్నారు. సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన తన ఛాంబర్ లో మండలి బీఏసీ సమావేశం జరిగింది. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసన సభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, ఎఫ్ఎండీ, శ్రీపాల్ రెడ్డి, శాసన మండలి సెక్రెటరీ డా.నరసింహాచార్యులు పాల్గొన్నారు.

## పోలీసులపై కేటీఆర్ చేయి చేసుకున్నట్లు కనిపించింది

బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు - బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరుపై ఆగ్రహం - తాతా మధు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎందుకు ఖండించడం లేదని ప్రశ్న

హైదరాబాద్ : బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ పోలీసులపై ఎన్నడు ఇలాంటి ఘటనలు జరగలేదన్న మంత్రి శ్రీధర్ బాబు, పోలీస్ సిబ్బందిని గొంతు పిసుకుతున్నట్లు కనిపించిందని తెలిపారు. సీనియర్ శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తి పోలీసులపై దాడి చేశారని, ఓ శాసనసభ్యుడు యూనిఫామ్‌లో ఉన్న పోలీస్ కాలర్ పట్టుకున్నారని ఆరోపించారు. పోలీసులపై దాడి చేయడాన్ని మీడియా ఛానళ్లలో స్పష్టంగా కనిపించిందని, పోలీసులపై కేటీఆర్ చేయి చేసుకున్నట్లు కనబడుతోందని వెల్లడించారు. పోలీసులపై దాడి చేస్తే అధికారంలోకి వస్తామని తామెప్పుడూ అనుకోలేదని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు హుందాగా ప్రవర్తించాలని హితువు పలికారు. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుంది : బీఆర్ఎస్ సభ్యుల తీరు చాలా దారుణంగా ఉందన్న మంత్రి బ్యాడ్జీలు తీసుకురాకూడదని గత బీఆర్ఎస్ ప్రభుత్వమే రూల్స్ రూపొందించిందని, టీషర్టుపై నినాదాలు ఉంటే అనుమతించకూడదని నిబంధన ఉందని గుర్తు చేశారు. సభా గౌరవాన్ని తగ్గించేలా బీఆర్ఎస్



సభ్యులు టీషర్టులపై నినాదాలు ఉన్నాయని మండిపడ్డారు. రూల్స్‌కు అనుగుణంగానే స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. రాహుల్‌కు ఒక న్యాయం, మాకో న్యాయమా అంటూ కేటీఆర్ అంటున్నారని, రాహుల్ టీషర్టుపై ఏదీ రాసుకొని లోక్‌సభకు వెళ్లలేదని తెలిపారు. గతంలో ప్లకార్డులు అనుమతించరని చెబితే తాము తీసుకెళ్లలేదని గుర్తు చేశారు. మహిళా సభ్యులకు ఇబ్బంది జరిగిందని తెలియగానే సీఎం సమీక్ష చేశారని, ఏవైనా లోటుపాట్లు జరిగితే ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎందుకు ఖండించదు : స్పీకర్‌పై అంత ఘోరమైన భాష ఉపయోగించడం సరికాదని హితవు పలికారు. తాతా మధు సభ్య సమాజం అసహ్యించుకునే భాష మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్పందించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందని, కేసీఆర్ స్పందించకుంటే ఆయనే ప్రేరేపించారన్న అనుమానాలు వస్తాయని తెలిపారు. తాతా మధు వ్యాఖ్యలకు బీఆర్ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తాతా మధు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎందుకు ఖండించదని ప్రశ్నించారు. క్షమాపణ చెప్పాకే మిగతా కార్యకలాపాలు : స్పీకర్ తల్లిని దూషించేలా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం మంత్రి మండిపడ్డారు. దళిత వ్యతిరేక పార్టీగా బీఆర్ఎస్ నిరూపించుకుంటుందని, తాతా మధు వ్యాఖ్యలు విని స్పీకర్ కన్నీరు పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ పోలీసులను బెదిరిస్తున్నారని, శాసనసభను దుశ్శాసన సభ అని కేటీఆర్ అవమానించారని, మహిళల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదని తెలిపారు. మహిళా మంత్రి లేకుండా ఐదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నడిపిందని విమర్శించారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారని, వారి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడే ప్రసక్తి లేదని స్పషం చేశారు. వారు స్పీకర్‌కు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. వారు స్పీకర్‌కు క్షమాపణ చెప్పాకే మిగతా కార్యకలాపాలు ఉంటాయని, తప్పు జరిగిందని ఒప్పుకునే మనస్సు ఉండాలని వెల్లడించారు. "ఓ శాసనసభ్యుడు యూనిఫామ్‌లో ఉన్న పోలీస్ కాలర్ పట్టుకున్నారు. పోలీసులపై దాడి చేయడాన్ని మీడియా ఛానళ్లలో స్పష్టంగా కనిపించింది. పోలీసులపై కేటీఆర్ చేయి చేసుకున్నట్లు కనపడింది. పోలీసులపై దాడి చేస్తే అధికారంలోకి వస్తామని మేము ఎప్పుడూ అనుకోలేదు. పోలీస్ సిబ్బందిని గొంతు పిసుకుతున్నట్లు కనిపించింది. ఉమ్మడి రాష్ట్రంలోనూ పోలీసులపై ఇలాంటి ఘటనలు జరగలేదు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారు. వారి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడే ప్రసక్తే లేదు

# ప్రభ బండ్లపై సీఐ చరమంద రాజు సందడి

## -భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ ప్రభ బండిపై సీఐ.. ప్రజలతో మమేకమైన పోలీసు అధికారి

**(హుజుర్ నగర్ మండలం)సెప్టెంబర్ 7,ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :**
హుజూర్‌నగర్ ముత్యాలమ్మ తల్లి జాతరలో హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు చేపట్టిన చర్యలు, ప్రజలతో ఆయన మమేకమైన తీరు ప్రత్యేకంగా నిలిచింది. జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు, ప్రభ బండ్లు, ట్రాక్టర్ల ఊరేగింపును దగ్గరుండి పర్యవేక్షిస్తూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసు సిబ్బందిని సమన్వయం చేశారు. జనసందోహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అదే సమయంలో ప్రభ బండ్లపై స్వయంగా ఎక్కి భక్తులతో కలిసి ఉత్సవంలో పాల్గొనడంతో అక్కడి వాతావరణంలో మరింత ఉత్సాహం నెలకొంది. విధి నిర్వహణలో భాగంగా భద్రతను పర్యవేక్షిస్తూనే ప్రజల మధ్యకు వెళ్లి వారితో కలిసిమెలిసి ఉండటం సీఐ ప్రత్యేకతగా నిలిచింది. సీఐ చరమంద రాజు ప్రభ బండిపై పాల్గొన్న దృశ్యాలను చూసిన భక్తులు, స్థానికులు ఆసక్తిగా స్పందించారు. పోలీసు అధికారి ప్రజల మధ్యకు వచ్చి జాతరలో భాగస్వామ్యం కావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. జాతర ప్రశాంతంగా కొనసాగేందుకు పోలీసు శాఖ చేపట్టిన బందోబస్తు, సీఐ పర్యవేక్షణపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూనే జాతర ఉత్సవ స్ఫూర్తిలో భాగస్వామ్యం కావడం ద్వారా సీఐ చరమంద రాజు ప్రజలకు మరింత చేరువయ్యారని స్థానికులు అభిప్రాయపడ్డారు



# అసెంబ్లీనా.. కౌరవసభనా?

## ప్రజాస్వామ్య సభలో పోలీసు రాజ్యం అంటూ బీఆర్ఎస్ నేతల ఆగ్రహం.. మఠంపల్లిలో భారీ నిరసన

**(మఠంపల్లి మండలం)సెప్టెంబర్ 7,ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :**
అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారంటూ బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలవాల్సిన అసెంబ్లీలోనే ప్రజాప్రతినిధులపై పోలీసుల బలప్రయోగం ఏమిటని ప్రశ్నిస్తూ సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ మండల నాయకులు ఇరుగు పిచ్చయ్య, మన్నెం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల కూడా పోలీసులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి తదితరులపై కూడా పోలీసులు దాడికి పాల్పడ్డారని వారు ఆరోపించారు. ప్రజల సమస్యలను శాసనసభలో ప్రస్తావించాల్సిన ప్రతిపక్ష ప్రజాప్రతినిధులపై పోలీసు బలాన్ని ప్రయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. "ప్రజాస్వామ్యానికి నిలయమైన అసెంబ్లీలోనే ప్రజాప్రతినిధులపై దాడులు జరిగితే అది అసెంబ్లీనా.. కౌరవసభనా?" అంటూ బీఆర్ఎస్ నేతలు తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల గొంతును అణచివేసే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసుల దౌర్జన్యాలు కొనసాగితే మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత ఉధృతంగా ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మఠంపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు,





మాజీ సర్పంచులు, మాజీ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు వెంటనే విడుదల చేయాలి

## జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలి.. దేవరకొండలో బీఆర్ఎస్ భారీ ర్యాలీ, మహాధర్నా

(దేవరకొండ మండలం)సెప్టెంబర్ 7, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తవుతున్నా విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆరోపించారు. విద్యార్థులు, యువత సమస్యల పరిష్కారం కోసం సోమవారం దేవరకొండ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, మహాధర్నా నిర్వహించారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ వరకు కొనసాగగా, అనంతరం మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల కాక వేలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. నిరుద్యోగులకు ప్రభుత్వం రూ.8,832 కోట్లు బకాయిపడిందని, వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలకు కారణమవుతున్న జీవో నంబర్ 97ను రద్దు చేయాలని, ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1,000 కోట్లు ఇస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలోనూ నిరుద్యోగులను మభ్యపెడుతోందని విమర్శించిన ఆయన, ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని అమలు చేయలేదని ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర



నాయకులు కేతావత్ బిల్యా నాయక్, పల్లా ప్రవీణ్‌రెడ్డి, పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్వీ నాయకులు, విద్యార్థులు, యువత, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఉచిత కంటి శిబిరం ఏర్పాటు అభినందనీయం

### ఉచిత కంటిపొర శిబిరాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

**(దేవరకొండ మండలం)సెప్టెంబర్ 7, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి** :పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు కంటి వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం దేవరకొండ మండలం పడమటిపల్లిలో పల్లా నర్సిరెడ్డి మెమోరియల్ సొసైటీ, హైదరాబాద్‌కు చెందిన శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటిపొర శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్ మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, చికిత్స అందించడం ద్వారా ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రజలు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని, ఇలాంటి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యానాయక్, పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, స్థానిక సర్పంచ్ పల్లా శ్రీకాంత్‌రెడ్డి, నాగవరం వెంకటేశ్వర్‌రావు, వెంకటయ్య, మాల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, మాల్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కొమ్ము రామస్వామి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# డీజేలకు నో పర్మిషన్.. వినాయక ఉత్సవాల్లోనూ డీజేలు పెట్టొద్దు

## శబ్ద కాలుష్యంపై పోలీసుల కఠిన వైఖరి.. డీజే యజమానులకు గరిడేపల్లి ఎస్సై బత్తిని శ్రీకాంత్‌గౌడ్ స్పష్టమైన హెచ్చరిక

(గరిడేపల్లి మండలం)సెప్టెంబర్ 7,ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడంలో భాగంగా మండలంలో డీజేలకు అనుమతులు ఇవ్వబోమని గరిడేపల్లి ఎస్సై బత్తిని శ్రీకాంత్‌గౌడ్ తేల్చిచెప్పారు. డీజేల వినియోగంపై స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘిస్తూ అధిక శబ్దంతో కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని డీజే యజమానులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించిన ఎస్సై, ప్రజల ఆరోగ్యం, ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే విధంగా డీజేలు నిర్వహించవద్దని స్పష్టం చేశారు. అధిక శబ్దం కారణంగా వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలు, ఊరేగింపులు తదితర సందర్భాల్లో డీజేలు ఏర్పాటు చేయరాదని సూచించారు. రానున్న వినాయక చవితి ఉత్సవాల్లోనూ డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేస్తూ.. ఉత్సవాల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దంతో డీజేలు నిర్వహిస్తే నిర్వాహకులు, డీజే యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసుల ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించి



శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. శబ్ద కాలుష్యంపై ఇకపై కఠినంగా వ్యవహరిస్తామని, నిబంధనల ఉల్లంఘనను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఎస్సై బత్తిని శ్రీకాంత్‌గౌడ్ స్పష్టం చేశారు.

# సంగారెడ్డి ఆర్టీసీ డిపో అధికారులకు వినతిపత్రం అందచేసిన తోపాజి అనంతకిషన్

(సంగారెడ్డి మండలం)ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 07.09.2026
సంగారెడ్డి ఆర్టీసీ డిపో అభివృద్ధి మరియు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ౹జీవీఖ యూనియన్ గౌరవ అధ్యక్షులు తోపాజి అనంతకిషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో డిపో మేనేజర్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ లను కలిసి వినతిపత్రం అందచేసిన తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రెసిడెంట్ మహేందర్, కార్యదర్శి విక్రమ్, రీజనల్ మహిళా కార్యదర్శి స్వరూప, డిపో మహిళా అధ్యక్షులు సక్కుబాయి, సభ్యులు సరిత, అమరమ్మ, సాయన్న, రాములు ప్రభాకర్, అనీల్, రవి, సురేష్ తదితరులు..ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు తోపాజి అనంతకిషన్ మాట్లాడుతూ సంగారెడ్డి డిపోను కార్మికుల పేరుతో బద్నామ్ చేసే విధంగా అధికారులు ప్రవర్తిస్తే ఊరుకోమని అన్నారు. సంగారెడ్డి డిపో లాభాల బాట పడే విధంగా జగ్గారెడ్డి సహకారంతో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో మాట్లాడి డిపో అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. వెంటనే కార్మికుల, మహిళా కార్మికుల సమస్యలు అన్ని పరిష్కరించి, పాత రూట్లలోనే అన్ని బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని పేర్కొన్నారు






# ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రజావాణి నిర్వహించకపోవడం దారుణం.

**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్.**

కుత్బుల్లాపూర్. సెప్టెంబర్.7 ప్రజా న్యూస్ నెట్వర్క్ ..
జిల్లా కలెక్టరేట్,మున్సిపల్ కార్యాలయంలో పాటు మండల రెవెన్యూ కార్యాలయంలో కూడా ప్రజావాణి నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిస్తే కుత్బుల్లాపూర్ రెవెన్యూ కార్యాలయంలో మాత్రం ప్రజావాణి నిర్వహించట్లేదని దరఖాస్తులు ఎప్పటిలాగే ఇన్ వార్డులో ఇచ్చి వెళ్తున్నారని ఇది ప్రభుత్వ నిర్ణయాలను సాక్షాత్తు ప్రభుత్వ అధికారులే అమలు చేయకపోవడం దారుణమని వెంటనే ఎమ్మార్వో గారు వచ్చే సోమవారం నుండి ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్ చేశారు.
జిల్లా కలెక్టరేట్లో జరిగే ప్రజావాణిలో సాక్షాత్తు జిల్లా కలెక్టర్ గారు లేనిపక్షంలో అడిషనల్ మరియు జాయింట్ కలెక్టర్లు కూర్చొని ఫిర్యాదులను స్వీకరించి ఆ సమస్యల పైన అధికారులకు అప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తారని అదేవిధంగా ఇక్కడ కూడా జరగాలని కోరారు.ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిని ఉపయోగించుకోవాలని సదుద్దేశంతో ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటికీ అన్ని సమస్యలు పరిష్కరించకపోయినప్పటికీ ప్రజలకు ఇంకా ప్రజావాణి పై విశ్వాసం ఉందని దాన్ని అధికారులు సమస్యలను పరిష్కరించకపోవడం వల్లే ప్రారంభమైనప్పుడు ఉన్నంత స్పందన నేడు లేకపోవడానికి కారణం అధికారుల నిర్లక్ష్యమేనని అన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ నిర్ణయాలను అమలుపరచాలని ఇలాంటి కార్యక్రమాల పైన పై అధికారులు కూడా ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకొని ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేయని అధికారులను సస్పెండ్ చేయాలని అన్నారు.



# అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ప్రభుత్వ నిర్బంధ వైఖరికి నిరసనగా సంగారెడ్డిలో రాస్తారోకో

## ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ శ్రేణుల భారీ నిరసన

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ తేదీ. 07.09.2026అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్బంధ వైఖరికి నిరసనగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు సంగారెడ్డిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. "సీఎం డౌన్ డౌన్", "ప్రజా వ్యతిరేక ప్రభుత్వం డౌన్ డౌన్", "బీఆర్ఎస్ గొంతు నొక్కడం ఆపాలి" అంటూ నినాదాలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ విఫల పాలనను అసెంబ్లీలో నిలదీస్తారనే భయంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో జరిగిన వైఫల్యాలను ప్రశ్నించకుండా ఉండేందుకే ప్రభుత్వం నిర్బంధ రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ప్రజల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతను చూసి సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనానికి గురవుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ప్రశ్నించే హక్కు ఉందని, ఆ హక్కును పోలీసులు, అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని అణచివేయాలని ప్రయత్నించడం సరికాదని స్పష్టం చేశారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని ఆరోపిస్తూ, ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వకుండా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని అన్నారు. పార్లమెంట్‌లో నల్ల టీషర్టులు ధరించి నిరసన వ్యక్తం చేసినప్పుడు తప్పుగా కనిపించని చర్య, తెలంగాణ అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి నిరసన తెలియజేస్తే ఎందుకు తప్పవుతుందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రతిపక్ష సభ్యులను అడ్డుకోవడం, మహిళా ప్రజాప్రతినిధులతో అనుచితంగా వ్యవహరించడం, పోలీసు బలగాలను ఉపయోగించి నిరసనలను అణచివేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. "పోలీసులను అడ్డుపెట్టుకుని మా గొంతును నొక్కాలని ప్రయత్నిస్తే సహించేది లేదు. ప్రజల సమస్యలు, కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలుపై మా పోరాటం మరింత ఉధృతం చేస్తాం" అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అధికారాన్ని ఉపయోగించి ప్రతిపక్షాన్ని అణచివేయడం కంటే, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై






సమాధానం చెప్పాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, చింత సాయినాథ్, మందుల వరలక్ష్మి, డాక్టర్ శ్రీహరి, మనోహర్ గౌడ్, నాగరాజు గౌడ్, చక్రపాణి, యువజన నాయకులు శ్రవణ్ రెడ్డి, వాజిత్, వేణుగోపాలస్వామితో పాటు పెద్ద ఎత్తున యువకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# గంగ కత్వ కాలువ ఆధునీకరణకు రూ.37.81 కోట్లు మంజూరు చేయించిన జగ్గారెడ్డి

**37.81 కోట్ల నిధులు మంజూరు చేస్తూ సోమవారం జివో విడుదల చేసిన నీటిపారుదల శాఖ**

**నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లకు కృతజ్ఞతలు తెలిపిన జగ్గారెడ్డి**


**3000 ఎకరాల ఆయకట్టుకు అందనున్న సాగు నీరు**

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ తేదీ 07.09.2026సదాశివపేట మండలం సూరారం గ్రామం నుండి మొదలయ్యే నిజాం కాలం నాటి గంగ కత్వ కాలువ ఆధునీకరణ కు జగ్గారెడ్డి చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించింది. నిజాం కాలం లో నిర్మించిన ఈ కాలువ ఇప్పటివరకు మరమ్మత్తు కు నోచుకోలేదు. దశాబ్దాల పాటు మరమ్మత్తుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపుతున్న పనులకు మోక్షం కలుగలేదు. గంగ కత్వ ఆయకట్టు రైతులు , స్థానిక నేతల కోరిక మేరకు జగ్గారెడ్డి మూడు నెలల క్రితం నీటి పారుదల శాఖ అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆధునీకరణ పనుల కోసం వెంటనే కొత్త ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. కాలువ ఆధునీకరణ పనులకోసం నీటి పారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఆ ప్రతిపాదనలకు ఆమోదిస్తూ రూ 37.81 కోట్లు మంజూరు కు పరిపాలన అనుమతులు జారీ చేస్తూ నీటిపారుదలశాఖ జీవో విడుదల చేసింది. గంగ కత్వ కాలువకు నిధులు మంజూరు పై జగ్గారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు నిర్మల ఆనందం వ్యక్తం చేశారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క లకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆధునీకరణ పనులు ఇలా...

గంగ కత్వ కాలువ సదాశివపేట మండలం సూరారం గ్రామం లో ప్రారంభం అయ్యి 11 గ్రామాలను కలుపుతూ సదాశివపేట మండలం లోని మాచిరెడ్డి పల్లి గ్రామం వరకు సుమారు 15 కిలో మీటర్ల పొడవునా విస్తరించి ఉంది. గంగకత్వ కాలువ కు 33 చెరువుల నుండి ఫీడర్ చానల్స్ ఉన్నాయి. ఆధునీకరణ పనుల్లో భాగంగా కాలువకు లైనింగ్ పనులు చేపడతారు. కాలువ పైన అవసరం ఉన్న చోట కొత్త బ్రిడ్జి ల నిర్మాణం, పాత వాటికి మరమ్మత్తు పనులు చేస్తారు. దీనితో పాటు కాలువ పొడవునా





GOVERNMENT OF TELANGANA

ABSTRACT

I & CAD Department – Minor Irrigation – Sangareddy District – Administrative approval for an amount of Rs.3781.00 Lakhs for the work of "Modernization of Gangakatva canal, Suraram (V), Sadashivpet (M), Sangareddy District" – Accorded – Orders – Issued.

IRRIGATION & CAD (MI) DEPARTMENT

G.O.Rt.No.458. Dated:07-09-2026

Read the following:-

1. From the Chief Engineer (MI), Hyderabad Letter No.ENC(G)/CE (MI)/Dy ENC(G)/DCE(MI)/DEE11/AEE29/Gangakatwa canal, Dated: 22-01-2025.
2. From the Engineer-in-Chief (General), Hyderabad Lr.No.ENC (G)/DY.ENC(G)/DCE(MI)/DEE11/AEE29/Gangakatwa canal, Dated 31-01-2026.
3. From the Engineer-in-Chief (General), Hyderabad Lr.No.ENC (G)/DY.ENC(G)/DCE(MI)/DEE11/AEE29/Gangakatwa canal, Dated 12-05-2026.
4. From the Engineer-in-Chief (General), Hyderabad Lr.No.ENC (G)/DY.ENC(G)/DCE(MI)/DEE11/AEE29/Gangakatwa canal, Dated 17-07-2026.

&&&&

ORDER:-

In the circumstances as reported by the Engineer-in-Chief (General), I & CAD Department, Hyderabad in the references read above and after careful examination of the matter, Government hereby accord administrative approval for an amount of Rs.37,81,00,000/- (Rupees Thirty Seven Crore and Eighty One Lakhs only) for the work of "Modernization of Gangakatva canal, Suraram (V), Sadashivpet (M), Sangareddy District" subject to the following conditions:

i. The Chief Engineer (I), Sanagreddy shall ensure that all provisions incorporated in the estimate are duly aligned with the actual site conditions and are in compliance with the applicable guidelines and relevant IS codes.

ii. The Chief Engineer (I), Sanagreddy is responsible for the correctness of measurements, rates adopted and provisions made in the estimate.

iii. The Chief Engineer (I), Sanagreddy shall obtain the approved designs and drawings for the structures and canal lining from the competent authority.

iv. The Chief Engineer (I), Sanagreddy shall ensure the providing of CC lining in case of expansive soils associated with swelling pressures as per the IS:9451-1994 guidelines.

v. By Meeting the expenditure within the B.E Provision, duly following G.O.Ms.No.12, I&CAD(P&B) Department, dated: 20.02.2016.

2. The expenditure shall be debited to the following Head of Account: "4702-00-101-25-21-530/531".

3. The Engineer-in-Chief (General), Hyderabad shall take further necessary action in the matter, accordingly.

-:2:-

4. This order issues with the concurrence of Finance (EBS.IX) Department vide their U.O.No.4050295/156/EBS.IX/A1/2026, dated 18.08.2026.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

E.SRIDHAR
SECRETARY TO GOVERNMENT

To
The Engineer-in-Chief (General), Hyderabad.
Copy to:-
The Chief Engineer (I), Sangareddy.
The Accountant General, Telangana, Hyderabad
The Director of Works & Accounts, T.S., Hyderabad.
The Pay and Accounts Officer, Sangareddy.
The P.S. to the Hon'ble Minister, Irrigation & CAD.
The P.S to Secretary to Government.
The Joint Secretary to Government (T).
The Finance (EBS.IX) Department.
SF/SC

// FORWARDED :: BY ORDER //

SECTION OFFICER

తుములకు రిపేర్లు చేస్తారు. ఈ కాలువ పనులు పూర్తయితే 3000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**పెండింగ్‌లో ఉన్న నోటీసుల జారీని రెండు రోజుల్లో పూర్తి చేయాలి**

**నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలి - జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ తేదీ.07.09.2026 ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులను రెండు రోజుల్లోగా పూర్తిగా అందజేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేసి, పారదర్శకమైన, సమగ్ర ఓటరు జాబితాను రూపొందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ (ా×=) ప్రక్రియలో భాగంగా నోటీసుల జారీ, అందజేత, హియరింగ్‌ల నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. సంగారెడ్డి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ సంగీత, సంబంధిత ఈఆర్ఓలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లాలో 4,60,387 నోటీసులు జనరేట్ చేయగా, 3,07,344 నోటీసులను సంబంధిత ఓటర్లకు అందజేయడం జరిగిందని తెలిపారు. మిగిలిన నోటీసుల జారీ ప్రక్రియను వేగవంతం చేసి రెండు రోజుల్లోగా పూర్తి చేయనున్నట్లు సీఈఓ కు తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఏఈఆర్ఓలు ప్రతిరోజూ తమ పరిధిలోని సూపర్‌వైజర్లు, బీఎల్ఓలతో పెండింగ్‌లో ఉన్న పనులను సమీక్షిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన పత్రాలను సమర్పించేలా బీఎల్ఓల ద్వారా వారికి తగిన అవగాహన, సహకారం అందించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల జారీని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడంతో పాటు, హియరింగ్‌లను కూడా సకాలంలో నిర్వహించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం జరగకుండా ఈఆర్ఓలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలోని ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంగీత, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# తాతా మధును బర్తరఫ్ చేయాలి

## - నిరసనగా దిష్టిబొమ్మ దహనం.

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ తేదీ 07.09.2026
ఈరోజు జరుగుతున్న వర్షాకాలం అసెంబ్లి సమావేశాలలో దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ గారిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు దుర్భాషలు, కించపరిచే వ్యాఖ్యలకు నిరసనగా సంగారెడ్డి జిల్లా ాజ సెల్ కమిటీ చైర్మన్ శ్రీ గంగేరి శ్రీహరి గారి ఆధ్వర్యంలో సంగారెడ్డి ాజ సెల్ టౌన్ కమిటీ మరియు మండల కమిటీ సభ్యులు దీ=ా నాయకులకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేశారు.






ఐబీ చౌరస్తాలోని నెహ్రూ, రాజీవ్ గాంధీ చౌక్ వద్ద దీ=ా నాయకులకు వ్యతిరేకంగా కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, మీాజ తాతా మధుల ఫ్లెక్సీలను దహనం చేయడం జరిగింది. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా ాజ సెల్ కమిటీ చైర్మన్ శ్రీ గంగేరి శ్రీహరి గారు, చిన్నా,కసిని మనోజ్, శ్రీకాంత్,కసిని రాజు, చిత్తారి యాదగిరి,కుమార్, రాజేష్,శాంతి కుమార్, అనీల్,మహేష్,రమేష్, కలివేముల మొగ్గలయ్య,ప్రకాష్,కలీల్, మోజెస్,విజయ్,అనసూయగారు,మంగ,విజయ,లక్షణ్, అరుణ్, విక్రాంత్, శామ్ తదితరులు పాల్గొన్నారు

## వెయ్యి రోజుల సీఎం రేవంత్ రెడ్డి విఫల పాలనపై ప్రజావాణిలో బీఆర్ఎస్ వినతిపత్రం

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ తేదీ.07.09.2026
వెయ్యి రోజుల సీఎం రేవంత్ రెడ్డి విఫల పాలనకు నిరసనగా, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ఆదేశాల మేరకు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారి సూచనల మేరకు బీఆర్ఎస్ నాయకులు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రాలు అందజేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటికైనా ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పాండుకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా, నాలుగు మండల కేంద్రాల్లోని ప్రజావాణి కార్యక్రమాల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, నరహరి రెడ్డి, చింత సాయినాథ్, డాక్టర్ శ్రీహరి, మందుల వరలక్ష్మి, మనోహర్ గౌడ్, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అక్రమ అరెస్టులతో బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధుల పట్ల పోలీసులు, ప్రభుత్వం వ్యవహరించిన తీరు సిగ్గు చేటు....

**బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధుల పార్టీ అక్రమ అరెస్ట్ కు నిరసనగా**

**కుత్బుల్లాపూర్ లో పెల్లుబిక్కిన "ఆగ్రహ జ్వాలలు"...**

కుత్బుల్లాపూర్. సెప్టెంబర్.7 ప్రజా న్యూస్ నెట్వర్క్ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు నల్ల టీ- షర్టులతో హాజరైన బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం పట్ల కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల, చింతల్, గాజుల రామారం, కొంపల్లి, దుండిగల్, నిజాంపేట్ సర్కిల్ కార్యాలయాల వద్ద బిఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల దగాపాలనపై అసెంబ్లీ వేదికగా ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలపై చర్చించేందుకు వెళ్తున్న బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరు సరైంది కాదని, రాజ్యాంగబద్ధంగా ఉన్న ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





## తెలంగాణ శాసనసభ వద్ద దాడిని ఖండిస్తూ బిఆర్ఎస్ రాస్తారోకో

(త్రిపురారం మండలం)సెప్టెంబర్ 7, ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :
తెలంగాణ అమరవీరుల స్థూపం సాక్షిగా తెలంగాణ శాసనసభ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులపై జరిగిన దాడిని ఖండిస్తూ, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిపై జరిగిన దాడికి నిరసనగా త్రిపురారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కోదాడ--జడ్చర్ల ప్రధాన రహదారిపై చేపట్టిన రాస్తారోకోతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల తరఫున ప్రశ్నించే ప్రజాప్రతినిధులపై దాడులు జరగడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో జరిగిన ఘటనలపై ప్రభుత్వం బాధ్యత వహించాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్, రాష్ట్ర బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులు కలకొండ వెంకటేశ్వర్లు, త్రిపురారం సర్పంచ్ బహిరం లక్ష్మీకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు మజ్జిగపు వెంకట్‌రెడ్డి, అనుముల శ్యాంసుందర్‌రెడ్డి, గుండెబోయిన ఎంకన్న, జంగిలి శ్రీనివాస్‌యాదవ్, సుశీల నాయక్‌తో పాటు వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, జిల్లా నాయకులు, మండల నాయకులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

